


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL   ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి   గురువారం   30-04-2026 సంపుటి : 07   సంచిక 329   పేజీలు : 8   వెల : రూ 3-00


# టీడీపీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



అమరావతి: తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించారు. పార్టీ అధినాయకత్వం పాత, కొత్త నాయకుల కలయికతో కమిటీలను ఏర్పాటు చేయడం ప్రత్యేకతగా నిలిచింది. టీడీపీ చరిత్రలో తొలిసారిగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు కల్పించడం విశేషంగా మారింది. 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని నిజం చేస్తూ, కష్టపడి పని చేసిన నాయకులకు కమిటీల్లో ప్రాధాన్యం ఇచ్చారు. 44 ఏళ్ల పార్టీ చరిత్రలో కూడా కొత్త ఉత్సాహం కనిపించేలా టీడీపీ హైకమాండ్ కమిటీలను నియమించింది. సీనియర్ నాయకుల అనుభవాన్ని, జూనియర్ నాయకుల దూకుడును సమపాళ్లలో కలిపి కమిటీలను రూపొందించారు. ఈ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే మంగళగిరి క్లస్టర్ ఇన్చార్జ్ గుత్తికొండ ధనుంజయ్, గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి కూడా హైలెట్‌గా నిలిచారు. గతంలో సోషల్ మీడియాలో చురుకుగా పని చేసిన పలువురికి కూడా కొత్త కమిటీల్లో అవకాశం ఇవ్వడం గమనార్హం. ఎన్టీఆర్, చంద్రబాబు అధ్యక్షులుగా ఉన్న కాలంలోలాగే, ఈసారి కూడా సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి కీలక బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఈ కొత్త కార్యవర్గంతో టీడీపీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# మే 4న బీజేపీ హ్యాట్రిక్ ఖాయం..

## ఐదు రాష్ట్రాల్లో మాదే విజయం: ప్రధాని మోదీ



న్యూ ఢిల్లీ, ఐదు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ చారిత్రక విజయం సాధించడం ఖాయమని, బీజేపీ హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంటుందని ప్రధాని మోదీ అన్నారు. మే 4న వెలువడే ఫలితాలు దేశాభివృద్ధిని మరింత బలోపేతం చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని హర్దోయిలో బుధవారం జరిగిన గంగా ఎక్స్‌ప్రెస్ వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాజా ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "పశ్చిమ బెంగాల్‌లో రెండో దశలో కూడా ఓటర్లు భారీ ఎత్తున ఓటింగ్?లో పాల్గొంటున్నారు. ఈసారి ఎన్నికలు గతంలోలాగా భయానక వాతావరణంలో కాకుండా ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి. గత ఆరు, ఏడు దశాబ్దాలలో ఎప్పుడూ ఇలా ఎన్నికలు జరగలేదు. పశ్చిమ బెంగాల్ ఓటర్లు భారీ స్థాయిలో ఓటింగ్‌లో పాల్గనడం ప్రజాస్వామ్యం బలోపేతానికి, రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనం. ఈ విషయంలో బెంగాల్ ప్రజలకు నా ధన్యవాదాలు. ఓటింగ్?కు ఇంకా కొన్ని గంటల సమయం ఉంది. ప్రజలంతా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఇటీవల బిహార్ ఎన్నికలు, తర్వాత గుజరాత్ సివిల్ ఎన్నికలలో విజయం తర్వాత ఇప్పుడు వెలువడబోయే ఫలితాలతో బీజేపీ హ్యాట్రిక్ సాధించడం ఖాయం. ఐదు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుంది. మే 4న వెలువడబోయే ఫలితాలు దేశాభివృద్ధిని మరింత వేగవంతం చేస్తాయి. మహిళా బిల్లుకు వ్యతిరేకంగా ఓటేయడం ద్వారా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు తాము మహిళా వ్యతిరేకులమని నిరూపించుకున్నాయి. యూపీ ప్రగతిని చూసి సమాజ్‌వాదీ పార్టీ అసంతృప్తితో ఉంది. వాళ్లు ఇంకా యూపీని వెనక్కు తీసుకెళ్తామని అనుకుంటున్నారు. సమాజాన్ని విడదీయాలని చూస్తోంది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు మహిళా వ్యతిరేక పార్టీలే కాకుండా.. దేశ అభివృద్ధి వ్యతిరేక పార్టీలు కూడా" మోదీ వ్యాఖ్యానించారు.

# రఘురామకు హైకోర్టులో షాక్..



విజయవాడ, ఏప్రిల్ 29 పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులోని ప్రభుత్వ స్థలంలో మతపరమైన కట్టడాల నిర్మాణంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా హైకోర్టులో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసులో వ్యక్తిగతంగా జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించిన మాజీ ఎంపీ, ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు తీరుపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. అసలు ఏ హోదాలో వాదనలు వినిపిస్తారని ప్రశ్నించడమే కాకుండా, తన పరిధి దాటి ప్రవర్తించవద్దని ఆయనను న్యాయస్థానం గట్టిగా హెచ్చరించడం సంచలనంగా మారింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ , జస్టిస్ నైనాల జయసూర్య లతో కూడిన ధర్మాసనం ఎదుట పిటిషనర్ జయంతి తరఫున ప్రముఖ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు గతంలో స్టేట్ ఆఫ్ గుజరాత్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఇచ్చిన తీర్పును ఉటంకిస్తూ.. ప్రభుత్వ స్థలాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రార్థనా మందిరాలు నిర్మించకూడదని గుర్తు చేశారు. పిటిషన్ వేసిన మరుసటి రోజే పోలీసుల సహకారంతో పురాతన భవనాన్ని కూల్చివేసి నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిని తక్షణమే నిలువరించాలని కోర్టును కోరారు. మరోవైపు రఘురామకృష్ణం రాజు తరఫున సీనియర్ న్యాయవాది రవి ప్రసాద్ హాజరై, అక్కడ 1930 నుంచే రామాలయం ఉందని, దానికి అన్ని ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని వాదించే ప్రయత్నం చేశారు. అయితే, రఘురామకృష్ణం రాజు వ్యక్తిగతంగా కోర్టులో వ్యవహరించిన తీరుపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం న్యాయస్థానాన్ని వేదికగా చేసుకోవద్దని స్పష్టం చేస్తూ, ఆయన వాదనలు వినడానికి తమకు ఎంతమాత్రం సమ్మతం లేదని తేల్చి చెప్పింది. న్యాయమూర్తుల అసహనం చూసిన రఘురామ వెంటనే కోర్టు హాల్ నుండి బయటకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. న్యాయస్థానంలో ప్రవర్తించాల్సిన తీరుపై రఘురామకు చురకలు అంటించింది. మీ పరిధి దాటి ప్రవర్తించకండి అంటూ చేసిన హెచ్చరిక కోర్టు హాల్ లో చర్చనీయాంశమైంది. ఈ వివాదంపై ఇప్పటికే సింగిల్ జడ్జి వద్ద విచారణ పెండింగ్‌లో ఉన్నందున, ఇరుపక్షాలు తమ వాదనలను అక్కడే వినిపించాలని ధర్మాసనం సూచించింది. వివాదాస్పద స్థలంలో వాస్తవానికి ఉన్నది గొంతెనమ్మ గుడినా లేక రామాలయమా అనే చారిత్రక , అధికారిక వాస్తవాలను నిశితంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సింగిల్ జడ్జిని ఆదేశించింది. తక్షణమే ఈ అంశంపై విచారణ జరిపి స్పష్టత ఇవ్వాలని ఆదేశిస్తూ ధర్మాసనం ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ముగించింది.

# ముగిసిన పోలింగ్.. మూడింట రెండువంతుల మెజారిటీ మాదే: మమతా బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ముగిసింది. 90 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. అయితే 6 గంటల లోపు క్యూలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం ఈసీ కల్పించడంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. పోలింగ్ సందర్భంగా చెదురుమదురు హింసాత్మక సంఘటనలు చేటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల ఈవీఎంలు మెరాయించడంతో ఓటింగ్ ఆలస్యంగా మొదలైంది. కాగా, పోలింగ్ పూర్తయిన వెంటనే టీఎంసీ గెలుపుపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. తమకు అందిన సమాచారం ప్రకారం బీజేపీ బెంగాల్‌లో ఓటమి చవిచూడనుందని, మూడింట రెండు వంతుల మెజారిటీతో టీఎంసీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని తెలిపారు. దీనికి ముందు తాను అభ్యర్థిగా నిలబడిన భవానీపూర్ నియోజకవర్గంలో తన ఓటు హక్కును మమతా బెనర్జీ వినియోగించుకున్నారు. సీఆర్‌పీఎఫ్, కేంద్ర బలగాలపై నిప్పులు చెరిగారు. ఒక్క పోలింగ్ బూత్‌కు కూడా సురక్షితంగా లేదన్నారు. అన్ని పోలింగ్ బూత్‌లు సీఆర్‌పీఎఫ్ గుప్పిట్లోకి వెళ్లిపోయాయని, ఎక్కడా కూడా రాష్ట్ర పోలీసులు బూత్ వద్ద కనిపించలేదని చెప్పారు






# మీ మాటలు మా కుటుంబానికి ఎంతో విలువైనవి: మంత్రి మనోహర్



అమరావతి, ఏప్రిల్ 29: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర రావు(90) మృతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం తెలియజేశారు. నాదెండ్ల భాస్కర రావు మృతి పట్ల ప్రధాని మోదీ సంతాప సందేశం పంపారు. ఏపీ ప్రజలకు దశాబ్దాల పాటు భాస్కరరావు తన జీవితాన్ని అంకితం చేసి.. అనేక సేవలందించారని కొనియాడారు. ఆయన అనుభవజ్ఞుడైన ప్రజా నాయకుడని, పలుమార్లు చట్ట సభలకు ఎన్నికై నిబద్ధతతో, చిత్తశుద్ధితో ప్రజా సమస్యలను వినిపించారని ప్రధాని తెలిపారు.'నాదెండ్ల భాస్కరరావు లేని లోటు పూడ్చలేనిది. ఆయన మృతిపై ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆయన జ్ఞాపకాలు అందరి హృదయాలలో చిరకాలం నిలిచి ఉంటాయి. ఈ కష్ట సమయంలో నా ఆలోచనలు మీ కుటుంబంతోనే ఉన్నాయి' అని ఏపీ రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌కి పంపిన సందేశంలో పేర్కొన్నారు. కాగా ప్రధాని సందేశం పట్ల మంత్రి నాదెండ్ల మనోహర్ కృతజ్ఞతలు తెలిపారు.'మీరు తెలిపిన ఓదార్పు మాటలు మా కుటుంబానికి ఎంతో విలువైనవి' అంటూ ప్రధాని మోదీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 22న మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు.

# సంపాదకీయం

గురువారం 30-04-2026

## ఆప్...సోపాలు

ఒకప్పుడు ఆమ్‌ఆద్మీ పార్టీ పేరు వింటే చాలు, సగటు మనిషి ఛాతీ గర్వంతో మరో రెండు అంగుళాలు విశాలమయ్యేది. అవినీతిని అంతమొందించడంలో, ప్రజారంజకమైన పాలన అందించడంలో ఆ పార్టీ ముందుంటుందన్న ధైర్యం వారిలో అడుగడుగునా కనబడేది. కానీ, పద్నాలుగేళ్లు తిరిగేసరికి ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అవినీతి కూపంలో నిండా మునిగిపోయి, ఊపిరాడక సతమతమవుతున్న ఆ పార్టీ సగటు మనిషికి ఏనాడో దూరమైంది. ఈ పరిస్థితికి కొంతవరకూ ఆ పార్టీ అధినేత కారణం కాగా, మరికొంత కేంద్రంలో చక్రం తిప్పుతున్న ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా కారణం. ఈ మిత్రద్వయం తరచూ వేస్తున్న ఎత్తుగడలకు చిత్తవడం కేజ్రీ వంతవుతోంది. మద్యం కుంభకోణం కేసులు బనాయించి, ముఖ్యమంత్రినే అరెస్ట్ చేయించి, ఆ కేసుల ఆధారంగా పార్టీ పెద్దలపై అవినీతి ముద్ర వేసి, ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకున్న ఈ కమలనాథులు అంతటితో ఆగలేదు. రాజ్యసభ సభ్యులైన ఏడుగురు ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలను తమవైపు తిప్పుకుని, బిజెపిలో విలీనం చేసుకోవడం తాజా పరిణామం. ఢిల్లీ మద్యం కేసులో సిబిఐ కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో రాబోయే పంజాబ్ ఎన్నికల్లో గెలుపు తమదేనని సంతోషిస్తున్న కేజ్రీవాల్‌కు ఆ సంబరం మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. నిన్నటివరకూ తనకు, పార్టీకి కుడిభుజంలా నిలబడినవారు సైతం అకస్మాత్తుగా ఇలా 'ఫిరాయించడం'తో కేజ్రీ దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆమ్‌ఆద్మీ పార్టీ పెట్టకముందునుంచీ కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితులుగా మెలగిన రాఘవ్ చద్దా, స్వాతి మలీవాల్ వంటివారు సైతం బిజెపి గూటికి చేరిపోవడం వింతల్లోకెల్లా వింత. రాజ్యసభలో తమ బలాన్ని పెంచుకోవడం, రాబోయే పంజాబ్ ఎన్నికల్లో పాగా వేయడం లక్ష్యంగా మోడీ, షా ద్వయం తాజా వ్యూహానికి తెర తీశారన్నది విస్పష్టం. ఆప్ ఎంపిల చేరికతో రాజ్యసభలో బిజెపి సభ్యుల బలం 113కి చేరగా, ఎన్‌డిఎ బలం 146కు పెరిగింది. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ (పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం) లో లొసుగులను ఆసరా చేసుకుని ఇలా ఇతర పార్టీల సభ్యులకు ఎర వేసినందుకు మోడీ, అమిత్ షాలను తప్పుబట్టడంలో తప్పేమీ లేదు. అయితే, ఒక రాజకీయ పార్టీ అధినేతగా ఉంటూ, పదేళ్లపాటు ఢిల్లీని పాలించి చాలినంత రాజకీయ, పాలనా అనుభవం గడించి కూడా.. ప్రత్యర్థుల ఎత్తుగడలను చివరిదాకా పసిగట్టలేకపోయినందుకు కేజ్రీవాల్‌నూ అంతే తప్పుపట్టాలి. ప్రాంతీయ పార్టీల పొడ అసలే గిట్టని భారతీయ జనతా పార్టీ పెద్దలు, వాటి ఊపిరి తీసేందుకు ఎంతకైనా తెగిస్తారనేది గత చరిత్రను తిరగేస్తే తెలుస్తుంది. దేశ రాజధానిలో తిష్ఠవేసుకుని కూర్చుని, తమకు పక్కలో బల్లెంలా మారిన ఆప్‌ను అంతమొందించాలన్నది మోడీ, అమిత్ షాల చిరకాల వాంఛ. అందులో చాలావరకూ కృతకృత్యులయ్యారన్నది ఢిల్లీలో అధికారాన్ని చేజిక్కించుకోవడంతోనే రుజువైంది. ఇక పంజాబ్ లోనూ ఆప్‌ను అధికారంనుంచి దింపడమే లక్ష్యంగా కేజ్రీవాల్ ఆరోపించినట్లు 'ఆపరేషన్ లోటస్'కు తెరతీశారు. మునుపటి ఎన్నికల్లో పంజాబ్‌లో ఆప్ విజ యం వెనుక కీలకపాత్ర పోషించిన రాఘవ్ చద్దాకు గాలం వేయడం అందులో భాగమే. అగ్నికి ఆజ్యం తోడైనట్లు, బిజెపి నేతల ఎత్తుగడలకు కేజ్రీవాల్ స్వయంకృతాపరాధాలు తోడయ్యాయి. అవినీతిని అంతం చేస్తానని నమ్మబలికిన ఆప్ అదే అవినీతికి ఆలవాలమైందన్న బిజెపి పెద్దల ఆరోపణలకు కేజ్రీవాల్ ఇంద్రభవనాన్ని తలదన్నుతూ కట్టుకున్న ఇల్లు, మద్యం కుంభకోణం వంటివి బలం చేకూర్చాయి. ఇప్పటికైనా మించింది లేదు. తమ పార్టీ నేతలు మరికొందరు చేజారకముందే ఆప్ అధినేత జాగ్రత్తపడటం మంచిది. వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే పంజాబ్ ఎన్నికల్లో బిజెపి ఎత్తుగడలను తిప్పికొట్టేలా పదునైన వ్యూహాలను రచించగలగాలి. కొన్నేళ్లుగా పంజాబ్ లో పలువురు ఆప్ నాయకులను బిజెపి నయానో భయానో తమవైపు తిప్పుకోగలిగింది. ఈ తెలివిడి, రాజకీయ చతురత లేకనే ఆప్ అగ్రనేతలు ప్రత్యర్థులు పన్నిన ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం భారత రాజకీయాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాఘవ్ చద్దా బీజేపీలో చేరిక. ఆప్ కీలక నేతగా పేరున్న రాఘవ్, అనూహ్యంగా కాషాయ పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆయన ఈ నిర్ణయం వెనుక కారణాలపై పలు ఊహాగానాలు చెలరేగుతుండగా, మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ సిద్ధూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. రాఘవ్ చద్దా బీజేపీలో చేరడానికి గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రానే ప్రధాన కారణమని ఆమె పేర్కొన్నారు. "రాఘవ్ చద్దా తన సోదరి పరిణీతి చోప్రా భర్త కావడంతో ఆయనను కాపాడుకోవడానికి ప్రియాంక ఈ నిర్ణయం తీసుకున్నారు" అని కౌర్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు రాఘవ్ వెనుక పడ్డారని, త్వరలోనే ఆయనపై ఈడీ దాడులు జరిగే అవకాశం ఉందని ప్రియాంకకు ముందే సమాచారం అందిందని ఆమె వెల్లడించారు. అందుకే తన చెల్లెలి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాఘవ్‌ను బీజేపీ వైపు మళ్లించారని కౌర్ పేర్కొన్నారు. అంతేకాకుండా, రాఘవ్ చద్దాకు ఆప్ అధిష్టానానికి మధ్య చాలా కాలంగా విభేదాలు ఉన్నాయని నవజ్యోత్ కౌర్ సిద్ధూ వివరించారు. పార్టీ కోసం రాఘవ్ సరిగా మాట్లాడటం లేదని ఆప్ నాయకత్వం భావించిందని, ఆ కారణంగానే వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయని ఆమె తెలిపారు. ఏదైనా తప్పు జరిగినప్పుడు అప్పుడే గళం విప్పాలని, నాలుగేళ్ల తర్వాత మాట్లాడటం సరికాదని ఆమె అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ రాజకీయ మార్పు రాఘవ్ చద్దా సోషల్ మీడియా ఇమేజ్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. బీజేపీలో చేరిన మరుసటి రోజే ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో 20 లక్షలకు పైగా (రెండు మిలియన్లు) ఫాలోవర్లను కోల్పోయారు. ఆప్ తన వ్యవస్థాపక సూత్రాలు, సిద్ధాంతాల నుంచి దూరంగా వెళ్లడంతో తాము బీజేపీలో విలీనమయ్యామని మీడియా సమావేశంలో చద్దా వెల్లడించారు. ఆప్ కోసం 15 ఏళ్లు నా రక్తం, చెమట ధారపోశాను.. సూత్రాలు, విలువలు, మౌలిక నైతికత నుంచి పార్టీ పూర్తిగా పక్కకు తప్పుకుంది" అని ఆయన అన్నారు. "రాజ్యాంగం ప్రకారం ఒక పార్టీకి చెందిన మొత్తం ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది మరో పార్టీలో విలీనం కావచ్చు" అని తమ పార్టీలోని 10 మంది ఎంపీల బలాన్ని ప్రస్తావిస్తూ చద్దా తెలిపారు. "వారు ఇప్పటికే సంతకాలు చేశారు.. ఈ ఉదయం మేము సంతకాలు చేసిన లేఖలు, ఇతర పత్రాలతో సహా అవసరమైన అన్నింటిని రాజ్యసభ ఛైర్మన్‌కు సమర్పించడం... విలీనానికి అనుమతించడం చకచకా జరిగిపోయాయి. అవినీతికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో పుట్టిన ఆప్.. 14 ఏళ్ల తర్వాత పార్టీ చరిత్రలోనే అత్యంత కఠినమైన సవాళ్లలో ఒకదాన్ని ఎదుర్కొంటోంది.

# ఆగస్టులోనే పరిషత్ ఎన్నికలు

హైదరాబాద్, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్) రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని వేచి చూస్తున్న ఆశావహులకు మరో బిగ్ షాక్ తగిలేలా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆలస్యమైన ఈ ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. మరికొన్ని రోజుల పాటు ఈ ఎన్నికల నిర్వహణ సాధ్యమయ్యేలా లేవు. జనగణన, ఉద్యోగుల బదిలీలతో పాలనపరమైన నిర్ణయాల నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించడం ఇప్పట్లో ఉండదని రాజకీయ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. దీంతో ప్రత్యేక అధికారులే పాలన సాగించనున్నారు. తెలంగాణలో గత కొంతకాలంగా వాయిదా పడుతూ వస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జులై నెల చివరి వరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ లేనట్లేనా అనే సందేహాలు కలుగుతున్నాయి. దీంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్న ఆశావహ అభ్యర్థులంతా మరికొంత కాలం వేచి చూడాల్సిన పరిస్థితి తప్పదనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రెండు నెలల పాటు జనగణన ప్రక్రియ నిర్వహించడంతోపాటు.. ఉద్యోగుల బదిలీలు కూడా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు తమ విధుల్లో బిజీగా ఉండనున్నారు. దీంతో ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పాలనాపరమైన ప్రక్రియలతోపాటు.. విద్యా సంవత్సరం మారనున్న నేపథ్యంలో జులై నెల చివరి వరకు స్థానిక ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని అర్థం అవుతోంది. మే, జూన్ నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణలో జనగణన ప్రక్రియను చేపట్టనుండగా.. ఈ ప్రక్రియలోనే మొత్తం అధికార యంత్రాంగం నిమగ్నం కానుంది. మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు తెలంగాణలో ఇంటింటి సర్వే నిర్వహించనుండటంతో జనగణన విధుల్లోనే అధికారులందరూ ఉండనున్నారు. మరోవైపు.. ఇప్పటికే మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎత్తివేసింది. ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగుల బదిలీల ప్రక్రియ మొత్తం మే నెల అంతా కొనసాగనుంది. ఆ తర్వాత మళ్లీ జూన్ 1వ తేదీ నుంచి ఉద్యోగుల బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. అయితే ఆ లోపు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ అసాధ్యమని స్పష్టం అవుతోంది. అదే సమయంలో జూన్ నెలలో రాష్ట్రంలో స్కూళ్లు తిరిగి ప్రారంభం కానున్నాయి. అడ్మిషన్ల పెంపు, స్కూళ్లను మరింత బాగు చేయడం వంటి కార్యక్రమాలపై రాష్ట్ర విద్యా శాఖ ప్రత్యేక దృష్టి పెట్టనుంది. ఇక ఉపాధ్యాయులు కూడా అడ్మిషన్ పనుల్లో బిజీగా ఉండటం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిబ్బంది కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు.. ఇప్పటికే ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికలు పూర్తి అయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం జరిగింది. దీంతో ఆశావహుల్లో ఉత్సాహం పెరిగింది. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు కులగణన లేదా తాజా జనగణన లెక్కలను ప్రామాణికంగా తీసుకోవాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ జనగణన ప్రక్రియ ముగియకుండా ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలా వద్దా అని రాష్ట్ర ప్రభుత్వం అయోమయంలో పడింది. రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్న వివరాల ప్రకారం.. జూలై నెల చివరి నాటికి రాష్ట్రంలో జనగణన సర్వేతో పాటు ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ కూడా ఒక కొలిక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఆ తర్వాత ఆగస్ట్ లేదా సెప్టెంబర్ నెలల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా కనిపిస్తోంది.

## కేసీఆర్ వల్లే కవితకు గుర్తింపు.. పోటీ చేస్తే డిపాజిట్ కూడా రాదు : కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 29, కూతురికి తండ్రి అంటే ప్రేమ ఉండాలని.. కేసీఆర్ వల్లే కవితకు గుర్తింపు వచ్చిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్యమకారుడు కేసీఆర్ బిడ్డగా కవితకు మంచి గుర్తింపు ఉందని.. కానీ కవిత పోటీ చేస్తే డిపాజిట్ కూడా రాదన్నారు. బుధవారం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ఒక ఉద్యమకారుడు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వ్యక్తి. అలాంటి వ్యక్తిని స్వయానా కూతురే మొట్టమొదటి సమావేశంలోనే అలా మాట్లాడి తప్పు చేసింది. దాంతోనే తెలంగాణ ప్రజలందరూ కూడా ఆలోచించుకుంటరు. తండ్రిని గౌరవించుకోలేని మనిషి ప్రజలకు తల్లి ఎట్లా అవుతది. ఈ విషయాన్ని నేను తీవ్ర బాధతో చెప్తున్నా. కవిత చాలా తప్పు మాట్లాడిందన్నారు. నీకు అధికారం కావాలని ఆశ ఉండొచ్చు. దాని కోసం నువ్వు ఫైట్ చేస్తే తప్పు లేదు.. కానీ నువ్వు నీ సొంత తండ్రినే ఆ మాట అనడం.. తెలంగాణలో నువ్వేదో చేస్తా అని అంటే ఎవరు నమ్ముతరు నిన్ను. ఆమె పార్టీ సంగతి పక్కన పెట్టు. సొంతంగా ఆమె పోటీ చేసి నియోజకవర్గంలో కూడా డిపాజిట్ కూడా రాదు కవితకు.. ఎందుకంటే తొలి సమావేశంలోనే తండ్రిని కేసీఆర్ లాంటి వ్యక్తిని తిట్టి ఆమె ఉన్న మర్యాద పోగొట్టుకుందన్నారు. పార్టీ పెట్టడమంటే పాన్ షాప్ పెట్టినంత సులువైంది.. అంటూ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఎన్నికల సంఘం పరిశీలకులు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నరు : మమతాబెనర్జి

న్యూ ఢిల్లీ, పశ్చిమబెంగాల్ లో బుధవారం రెండో విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో తాను బరిలో నిలిచిన భవానీపూర్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి మమతాబెనర్జి వెళ్లారు. ఆమెపై పోటీ చేస్తున్న బీజేపీ నేత సువేందు అధికారి కూడా అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన వచ్చేసరికి అక్కడే కూర్చొని ఉన్న మమతను ఉద్దేశించి.. 'ఆమెను చూడండి. ఆమెకు ఈరోజు ఎవరూ ఓటేయరు' అని వ్యాఖ్యానించారు. దాంతో బీజేపీపై, ఎన్నికల సంఘంపై సీఎం మమత విమర్శలు చేశారు.



కేంద్ర బలగాలకు చెందిన సభ్యులు తమ పార్టీ కార్యకర్తల ఇళ్లల్లోకి చొరబడి ఓటర్లను భయపెడుతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతున్నదని ఆరోపించారు. ఎన్నికల సంఘం పరిశీలకులు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తృణమూల్ కార్యకర్తను రాత్రి తీవ్రంగా కొట్టారని చెప్పారు. ఇదేం గూండాయిజమని ప్రశ్నించారు. ఎన్నికలంటే ప్రజాస్వామ్య పండగ అని, కానీ వారు పండగ స్ఫూర్తినే దెబ్బతీస్తున్నారని మమత మండిపడ్డారు. కాగా సీఎం మమతాబెనర్జి గూండాగిరి చేస్తున్నారని సువేంధు అధికారి విమర్శించారు. ఆమె గూండాలను వెంటేసుకొని తిరుగుతూ ఓటర్లను భయపెడుతున్నారని కౌంటర్ ఇచ్చారు.

## బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కమిటీలన్నీ రద్దు.. ప్రకటించిన మహేశ్ బిగాల

బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కమిటీలు అన్నీ రద్దయ్యాయి. రాష్ట్ర కమిటీ మినహా అన్ని కమిటీలను రద్దు చేయాలని పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయం మేరకు ఎన్ఆర్ఐ కమిటీలను రద్దు చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామని బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల వెల్లడించారు. త్వరలోనే బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం సమగ్ర సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కొత్త సభ్యత్వ ప్రతిపాదికన, పద్ధతిగా, వ్యవస్థీకృతంగా కొత్త కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మార్పుల దశలో అన్ని కమిటీల సభ్యులు, మద్దతుదారులు సహకరించి పార్టీ నాయకత్వం, దాని దూరదృష్టికి తమ మద్దతు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

## ఈవీఎం బటన్‌కు టేపులు వేస్తే రీపోలింగ్: బెంగాల్ ఎన్నికల అధికారి


కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఓటింగ్ అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఫాల్టాలో ఈవీఎంల బటన్‌లకు టేపు వేసినట్లు బీజేపీ ఆరోపించింది. ఆ ఆరోపణలపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి స్పందించారు. ఒకవేళ ఏదైనా ఈవీఎం బటన్‌ను ట్యాంపర్ చేస్తే, ఆ పోలింగ్ బూత్‌లో రీపోలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఇవాళ రాష్ట్రంలో రెండో దశ అసెంబ్లీ పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. డైమండ్ హార్బర్ నియోజకవర్గంలో



పోలింగ్ అధికారులు ఓటర్లను అడ్డుకుంటున్నారని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల బటన్‌లకు టేపులు వేశారని బీజేపీ ఆరోపించింది. అయితే ఇలాంటి ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలోనే పరిశీలించనున్నట్లు సీఈసీ తెలిపారు. బీజేపీ నేత అమిత్ మాల్వియా ఈ వివాదానికి తెరలేపారు. ఫాల్టాలోని అనేక పోలింగ్ బూతుల్లో తమ పార్టీకి ఓటు వేసే ఆప్షన్‌ను బ్లాక్ చేశారన్నారు. ఈవీఎం బటన్‌పై టేపు వేసి ఓటు వేయకుండా చేస్తున్నారని పేర్కొన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో మాల్వియా స్పందిస్తూ ఇది డైమండ్ హార్బర్ మోడల్ అని విమర్శించారు. ఈవీఎం బటన్లకు టేపు వేసిన పోలింగ్ బూతుల్లో రీపోలింగ్ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. డైమండ్ హార్బర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా దీపక్ కుమార్ హాల్దర్, టీఎంసీ సిట్టింగ్ ఎమ్మెల్యే పన్నాలాల్ హాల్దర్ పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో పన్నా లాల్ 16 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. డైమండ్ హార్బర్ మోడల్ అన్న టైటిల్‌తో బీజేపీ ఓ వీడియోను రిలీజ్ చేసింది. ఈవీఎంపై ఉన్న ఆ పార్టీ బటన్‌ను టేపుతో బ్లాక్ చేశారు. ఇక ఇవాళ ఉదయం 11 గంటల వరకు రెండో దశలో సుమారు 40 శాతం ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. ఇప్పటికే పుర్బా బర్ధమాన్‌లో 44.50 శాతం, హూగ్లీలో 43.12 శాతం, కోల్‌కతా నార్త్‌లో 38.39 శాతం, కోల్‌కతా సౌత్‌లో 36.78 శాతం ఓట్లు పోలయ్యాయి. మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది.

## అమెరికా సర్కారు సంచలన నిర్ణయం.. ట్రంప్ ఫొటోతో పాస్‌పోర్టులు

అమెరికా ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫొటోతో ఉన్న పాస్‌పోర్టులను త్వరలో విడుదల చేయాలని నిర్ణయించింది. అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలకు గుర్తుగా పరిమిత సంఖ్యలో వీటిని రూపొందించనున్నట్లు పలు మీడియాల్లో కథనాలు వచ్చాయి. తాజాగా అమెరికా విదేశాంగశాఖ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. కాగా జూలైలో అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకలు జరగనున్నాయి. ఈ



చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా రూపొందించిన యూఎస్ పాస్‌పోర్టులు విడుదల చేసేందుకు విదేశాంగ శాఖ సన్నద్ధమవుతున్నది. అయితే ఈ పాస్‌పోర్టులు పరిమిత సంఖ్యలో ఉండనున్నాయని విదేశాంగశాఖ ప్రతినిధి టామీ పిగాట్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ పాస్‌పోర్టులకు ఎలాంటి అదనపు రుసుము ఉండదని విదేశాంగ వర్గాలు వెల్లడించాయి. పాస్‌పోర్టులు విడుదల చేయనున్న విషయాన్ని వైట్‌హౌస్ కూడా ఎక్స్ వేదికగా ధ్రువీకరించింది. ందుకు సంబంధించిన ఫొటోలను కూడా పంచుకుంది. అందులో స్వాతంత్ర్య ప్రకటన పత్రంపై ట్రంప్ ఫొటో ఉండగా.. దాని కింద బంగారు రంగులో ఆయన సంతకం ఉంది. మరొక దానిలో యూఎస్ వ్యవస్థాపక పితామహుల చారిత్రాత్మక ఫొటో ఉంది. ప్రస్తుతం ఇవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. అధికారంలో ఉన్న నాయకుల ఫొటోలతో పాస్‌పోర్టులు రూపొందించడం చాలా అరుదు. అనేక దేశాలు చారిత్రక దృశ్యాలు, ప్రకృతి చిత్రాలను ముద్రించేందుకు ప్రాధాన్యం ఇస్తాయి. ప్రస్తుతం యూఎస్ పాస్‌పోర్టులపై చరిత్రలోని ముఖ్య ఘట్టాలు, స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వంటి చారిత్రక ప్రదేశాలు ముద్రించి ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పుడు ట్రంప్ ఫొటోతో పరిమిత సంఖ్యలో పాస్‌పోర్టులను రూపొందించాలని అమెరికా నిర్ణయించింది. కాగా 250వ స్వాతంత్ర్య వేడుకలకు గుర్తుగా ట్రంప్ ముఖచిత్రంతో స్మారక నాణెం రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ట్రంప్ సంతకం ఉన్న కరెన్సీ నోట్లను విడుదల చేయనున్నట్లు ట్రెజరీశాఖ ప్రకటించింది. దాంతో అమెరికా కరెన్సీ నోట్లపై సంతకం చేయబోయే తొలి అధ్యక్షుడిగా ట్రంప్ చరిత్ర సృష్టించనున్నారు.

## సువేందును చుట్టుముట్టిన టీఎంసీ మద్దతుదారులు.. స్వల్ప లాఠీచార్జి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ఏడు జిల్లాల్లోని 142 నియోజకవర్గాల్లో చురుకుగా జరుగుతోంది. బెంగాల్ ప్రతిపక్ష నేత, భవానీపూర్ బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి ఎన్నికల ఏర్పాట్లు తనిఖీ చేసేందుకు బుధవారం ఒక పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నప్పుడు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. టీఎంసీ మద్దతుదారులు అక్కడకు చేరుకుని 'జై బెంగాల్' నినాదాలు చేశారు. కొద్దిసేపటికే వారంతా సువేందును చుట్టుముట్టడంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. దీంతో స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ వెంటనే జోక్యం చేసుకుని స్వల్పంగా లాఠీచార్జి జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా, పోలింగ్ బూత్ వద్ద తనను ముందుకు కదలకుండా చుట్టుముట్టిన వాళ్లంతా బంగ్లాదేశ్ ముస్లింలని సువేందు తెలిపారు. వాళ్లంతా భయంతో వణుకుతున్నారని, మమత బెనర్జీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని అన్నారు. పోలింగ్ బూత్ వద్ద తలెత్తిన ఉద్రిక్తతను వెంటనే అదుపులోకి తెచ్చామని, ఎలాంటి అవంతారాలు లేకుండా అన్ని నియోజకవర్గాల్లోనూ పోలింగ్ చురుకుగా, ప్రశాంతంగా జరుగుతోందని అధికారులు తెలిపారు. కాగా, మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతానికి 61.11 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగియడానికి మరో కొద్ది గంటలు ఉండటంతో పోలింగ్ శాతం భారీగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పోలింగ్ ప్రక్రియలో తృణమూల్ కాంగ్రెస్ అక్రమాలకు పాల్పడుతోందని బీజేపీ ఆరోపించగా, బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతోందంటూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపణలు చేశారు.

## పాత బస్సులకు కొత్త రంగులు...




విజయవాడ ఏప్రిల్ 29, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుస్థిర విద్యుత్ వాహన పాలసీ 4.౦ కింద ఆర్టీసీలో సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో డీజిల్ ఖర్చు తగ్గించి కాలుష్యాన్ని నివారించేందుకు విద్యుత్ బస్సుల్ని తీసుకొస్తోంది. కేంద్రం నుంచి 1050 బస్సులు కేటాయించగా.. మరో 1450 బస్సుల్ని తీసుకురావాలని నిర్ణయించింది. అంతేకాదు కాలం చెల్లిన పాత బస్సుల్ని రీమోడల్ చేసి విద్యుత్ బస్సులుగా మార్చేస్తోంది. పాత డీజిల్ బస్సును విద్యుత్ బస్సుగా మార్చేశారు. ఈ మేరకు ట్రయల్ రన్ నిర్వహించారు.ఆర్టీసీలో పాత బస్సులు కొన్ని లక్షల కిలోమీటర్లు తిరిగి ఉంటాయి.. ఈ కాలం చెల్లిన బస్సును ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ కింద రెట్రోఫిట్‌మెంట్ చేసి, విద్యుత్‌తో నడిచే ఏసీ బస్సుగా మార్చేశారు. పాత సూపర్ లగ్జరీ బస్సును కళ్యాణీ ట్రాన్స్ సంస్థ (భారత్ ఫోర్జ్) ప్రయోగాత్మకంగా విద్యుత్ ఏసీ బస్సు (ఇంద్ర సర్వీస్)గా మార్చేసింది. ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సును విజయవాడ ఆర్టీసీ హౌస్‌కు తీసుకురాగా అధికారులు పరిశీలించారు. ఈ బస్సును కొంతకాలం ట్రయల్ రన్ కోసం ఏదైనా రూట్‌లో నడపాలని నిర్ణయించారు. ఈ బస్సుకు ఎంతసేపు ఛార్జింగ్ చేస్తే ఎన్ని కిలోమీటర్లు మైలేజ్ వస్తుందో పరిశీలించనున్నారు. పాత బస్సుల్ని ఇదే తరహాలో రెట్రోఫిట్‌మెంట్ చేస్తే ఎంత ఖర్చవుతుంది?.. కొత్త విద్యుత్ ఏసీ బస్సులు తీసుకోవడం కంటే.. ఇలా పాత వాటిని మార్పు చేస్తే ఎంత ఖర్చువుతుంది? వంటి అంశాలను పరిశీలించనున్నారు. ఇప్పటికే చిత్తూరు ఆర్టీసీ డిపోలో డీజిల్ బస్సును సీఎన్జీ బస్సుగా మార్చేశారు.. ఇప్పటికే ఈ బస్సు ట్రయల్ రన్ కూడా పూర్తి చేశారు. ఇప్పుడు పాత బస్సుల్ని విద్యుత్ బస్సులుగా మార్చేస్తున్నారు.మరోవైపు ఏపీఎస్ఆర్టీసీకి ఎలాంటి డీజిల్ కొరత లేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 11 వేల బస్సులకు రోజుకు 7.5 లక్షల లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది.. అయితే ప్రస్తుతం అన్ని బస్సు సర్వీసులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నడుస్తున్నాయని చెప్పారు. ఆర్టీసీ బస్సులకు సంబంధించిన డీజిల్ విషయంలో ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని అధికారులు తెలిపారు

## రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు



విజయవాడ, ఏప్రిల్ 29, ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మాడు పగలగొడుతున్నాయి.. రాష్ట్రంలో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫిబ్రవరి నెల నుంచే ఎండల తీవ్రత కనిపించింది.. ముందు 35 డిగ్రీల నుంచి మొదలై 40 డిగ్రీల వరకు చేరింది. మార్చి నెల నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగాయి.. 42 డిగ్రీల నుంచి 45 వరకు ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతులు 45 డిగ్రీలు కూడా దాటి 46 డిగ్రీల వరకు నమోదవుతోంది. ఎండలకు తోడు వేడిగాలులు, ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇవాళ అధిక ఉష్ణోగ్రతలతో పాటుగా 19 మండలాల్లో తీవ్రమైన వేడిగాలులు, 21 మండలాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉందన్నారు. విజయనగరం జిల్లాలోని బాడంగి, బొబ్బిలి, రామభద్రాపురం, తెర్లాం, వంగర మండలాల్లో.. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలోని బలిజిపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, సీతానగరం, వీరఘట్టం మండలాల్లో తీవ్ర వేడిగాలుల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. మార్కాపురం జిల్లా కంభంలో 45.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డైంది. నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో 45.1 డిగ్రీలు, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 44.8 డిగ్రీలు, అమరావతిలో 44.2 డిగ్రీలు, తిరుపతి జిల్లా బెస్తపల్లిలో 44.2 డిగ్రీలు, కడప జిల్లా వీరబల్లిలో 44.2 డిగ్రీలు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మొత్తం 28 జిల్లాలకు గాను 20 జిల్లాల పరిధిలోని 227మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.ఏపీలో ఎండలు, వేడిగాలులు, ఉక్కపోత ప్రభావం కనిపిస్తోంది.. జనాలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లొద్దని అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అంటున్నారు. రాష్ట్రంలో మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు.

# మారని తమ్ముళ్లు...

విజయవాడ ఏప్రిల్ 29, ఒకరి తర్వాత మరొకరు. ఒక ఇష్యూ తర్వాత మరో రచ్చ. ఎమ్మెల్యేలే కాంట్రవర్సీకి తెరలేపుతున్నారో..లేక వివాదాలే వాళ్లను వెతుక్కుంటూ వస్తున్నాయో తెలియదు కాని.. ప్రతి నెల రోజులకో ఎమ్మెల్యే తీరు ఇష్యూ అవుతోంది. టీడీపీ అధినేతకు హెడెక్ అవుతోంది. పర్సనల్ లైఫ్ వేరు. పబ్లిక్ లైఫ్ చాలా సున్నితమైంది. ప్రజా జీవితంలో ఉన్న నేతలు..వారి చుట్టున్న వాళ్లు చిన్న మిస్టేక్ చేసిన పెద్ద రచ్చ అవుతోంది. పొలిటికల్ లైఫే తలకిందులైన సందర్భాలు ఉన్నాయి. అందుకే చేసే ప్రతీ..మాట్లాడే ప్రతీ మాట ఎంతో ముఖ్యం. రాజకీయ నాయకులు అయితే ఎంత జాగ్రత్తగా ఉంటే అంత బెటర్. ఎంత ఆచితూచి వ్యవహరిస్తే అంత మంచిది. దూకుడే పేరు తెచ్చి పెట్టినా..ఆ దూకుడు స్వభావమే నట్టేట ముంచొచ్చు. సింపుల్ లివింగ్, లో ప్రొఫైల్..హై థింకింగ్‌కు అలవాటు పడిన వారికే బెటర్ పొలిటికల్ ఫ్యూచర్ ఉంటుందన్నది..సీనియర్ లీడర్లను చూస్తే అర్థమవుతోంది. ఎమ్మెల్యేలు సరిగ్గా ఉంటే సరిపోదు..వారి కుటుంబ సభ్యులు, అనుచరులు, సిబ్బంది అందరి ప్రవర్తన లెక్కలోకి వస్తుంది. చివరకు ఎమ్మెల్యేతో ఫోటో దిగిన వ్యక్తి ఏదైనా తప్పు చేసి దొరికినా..అది ఆ ప్రజాప్రతినిధి మెడకు చుట్టుకోవడం ..ఆయన సమాధానం చెప్పుకునే పరిస్థితులకు దారితీస్తుంది.ఏ పొలిటికల్ లీడర్ అయినా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే..తాము చేసే ప్రతి పనిని ప్రజలు గమనిస్తున్నారని. అది పబ్లిక్ మీటింగ్‌లో కావొచ్చు. రోడ్డు మీద కావొచ్చు. ఎక్కడైనా ప్రవర్తన చాలా ముఖ్యం. ఎప్పుడూ ఏ రూపంలో వివాదంలో చిక్కుకోవాల్సి వస్తుందో చెప్పలేమ్. ఏ మాత్రం టంగ్ స్లిప్ అయినా..ఎక్కడ తమ బిహేవియర్ డిఫరెంట్‌గా కనిపించినా..మీడియా, సోషల్ మీడియా చెడుగుడు ఆడేస్తుంది. ఆ తర్వాత ఎన్ని వివరణలు ఇచ్చుకున్నా..ఎన్ని కవర్ డ్రైవ్‌లు చేసినా డ్యామేజ్ కంట్రోల్ అవడం కష్టం. ఒక ఎమ్మెల్యే చేసే మిస్టేక్ ఆయనకే పరిమితం కాదు. ఓవరాల్ పార్టీకి బ్యాడ్‌నేమ్ తెస్తున్న పరిస్థితి.టీడీపీ ఎమ్మెల్యేల విషయంలో సీన్ మరోలా ఉంది. ఎప్పుడూ ఎవరో ఒక ఎమ్మెల్యే వివాదాల్లో



చిక్కుకోవడం..సీఎం చంద్రబాబు సీరియస్ అవడం కామన్ అయిపోయింది. అందరిదీ ఒక కథ అయితే..కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎపిసోడ్ సమ్‌థింగ్ డిఫరెంట్. ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే అయిన సురేంద్రబాబుకు నియోజకవర్గంలో మంచి పేరే ఉందంటున్నారు తెలుగు తమ్ముళ్లు. ఆయన ఎలాంటి కాంట్రవర్సీలు, అనవసర విషయాలకు జోలికి వెళ్లరని చెప్తున్నారు. కానీ టోల్ ప్లాజా ఎపిసోడ్‌లో ఆయన అనుచరులు చేసిన వీరంగం పెద్ద రచ్చ అయింది. చివరకు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు రియాక్ట్ అయి కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించే వరకు వచ్చింది.టోల్ గేట్ దగ్గర ఏం జరిగింది.. తప్పు ఎవరిదన్న విషయం పక్కన పెడితే జరగాల్సిన ఇష్యూ జరిగింది. టీడీపీ, కూటమి ప్రభుత్వంపై విమర్శలు రావడం..డ్యామేజ్ కంట్రోల్ కోసం చర్యలు తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. అయినా చర్చకు, విమర్శకు అవకాశం ఇచ్చినట్లు అయింది.

ఇక్కడ ఎమ్మెల్యే విషయంలో ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేకున్నా.. ఆయన ముందే టోల్ గేట్ సిబ్బందిపై అనుచరులు దాడి చేశారన్న వార్తలు తీవ్ర విమర్శలకు దారితీశాయి.సీఎం చంద్రబాబు పదేపదే ఎమ్మెల్యేలకు సూచిస్తున్నది ఇదే. పబ్లిక్ లైఫ్‌లో ఉన్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి. చిన్న ఇష్యూనే కదా ఏం కాదు అనుకుంటే కుదరదు అంటూ పదే పదే హెచ్చరిస్తూ వస్తున్నారు. ప్రజాప్రతినిధుల బిహేవియర్ చాలా ఇంపార్టెంట్. జనం మన ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తానే ఉంటారన్న విషయం గుర్తూ చేస్తూనే ఉన్నారు. అక్కడక్కడ ఎమ్మెల్యేలు.. పొరపాటుగానో..కావాలనో రచ్చకెక్కడం, ఇష్యూకు తెరలేపడం రెగ్యులర్ అయిపోయింది. అనవసర విషయాలు, కాంట్రవర్సీల్లో వేలు పెడుతున్న ఎమ్మెల్యేల విషయంలో ఇప్పటికే పలుసార్లు సీరియస్ అయిన సీఎం చంద్రబాబు..ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు కఠినంగా వ్యవహరించాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.

# ఆకివీడు రామాలయం అడుగులు

ఏలూరు, ఏప్రిల్ 29, పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులోని పెదపేటలో శ్రీరామ నవమి కూటమి నేతలు, రామభక్తులపై దాడి ఘటన కలకలం రేపింది. మార్చి 8న పెదపేటలో రామాలయం పునరుద్ధరణ చేయాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రకటించడంతో స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. కొందరు స్థానికులు మార్చి 17న కొంతమంది గొంతెనమ్మ ఆలయం పేరుతో ఫ్లెక్సీ కట్టారు. ఆ తర్వాత మార్చి 27న శ్రీరామనవమి రోజు రఘురామ పూజల కోసం వెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కూటమి నేతలతో పాటుగా మరికొందరిపై దాడులు జరిగాయి.. ఈ కేసులో 58మందిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో నిందితుడిగా ఉన్న భీమవరానికి చెందిన మీసాల జయరాజు జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలయ్యారు. తాజాగా ఆకివీడు పెదపేట ఘటనకు సంబంధించి సంచలన విషయాలను వెల్లడించారు. పెదపేటలో వివాదం, గొడవల వెనుక పాస్టర్ ఇస్మాయిల్ పాత్ర ఉందంటూ చెప్పుకొచ్చారు.ఆకివీడులో శ్రీరామనవమి రోజు జరిగిన ఘటనలో తనపై కూడా కేసు నమోదైందని జయరాజు చెప్పుకొచ్చారు. తనపై కూడా ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేయడంతో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చినట్లు తెలిపారు. పెదపేటలో చర్చిలు కూల్చివేసి దళితులపై దాడిచేసి ఇళ్లు కూల్చి వేస్తున్నారని పాస్టర్ ఇస్మాయిల్ తనకు ఫోన్ చేశారని.. శాంతియుత ర్యాలీ చేయాలని చెప్పడంతో ఒక దళిత నాయకుడిగా తాను అక్కడికి వెళ్లానన్నారు. ఆ రోజే ఇస్మాయిల్ అనే వ్యక్తి మొదటిసారి పరిచయం అయ్యారని చెప్పుకొచ్చారు.శాంతియుత ర్యాలీ అని చెప్పి ఉన్నట్టుండి పాస్టర్ ఇస్మాయిల్ పక్కనే ఉన్న టవర్ ఎక్కారని.. శాంతియుత ర్యాలీ అని చెప్పి ఇలా చేయడం సరికాదని ఆయనకు నచ్చజెప్పానని జయరాజు తెలిపారు.ఇస్మాయిల్ టవరెక్కడంతో.. ఆయన పాస్టర్ కాబట్టి.. పెదపేటలో కూలగొట్టినట్లు చెబుతున్న చర్చిల్లో ఈయన చర్చి కూడా ఉందనే బాధతో ఇలా టవర్ ఎక్కాడని తాను భావించానన్నారు జయరాజు. కానీ ఆ తర్వాత స్థానికుల్ని అడిగి ఇస్మాయిల్ గురించి తెలుసుకుంటే.. కూలగొట్టినట్లు చెబుతున్న వాటిలో పాస్టర్ చర్చి కూల్చలేదని తెలిసిందన్నారు. కొద్దిసేపటి తర్వాత ఇస్మాయిల్ కిందకు వచ్చారని.. తాను అక్కడి నుంచి వెళ్లిపోయానన్నారు. అనంతరం చర్చిలు కూల్చివేతలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లామని.. కానీ పాస్టర్ ఇస్మాయిల్ మాత్రం అక్కడికి రాలేదన్నారు. ఆయన్ను హౌస్ అరెస్ట్ చేసినట్లు తనకు తెలిసిందని.. ఇంలో పోలీసులు ఇస్మాయిల్‌ను కొట్టినట్లు తనకు సమాచారం వచ్చిందన్నారు. తీరా తాను వెళ్లి ఆరా తీస్తే ఆయన్ను పోలీసులు కొట్టలేదని తనకు తెలిసిందన్నారు. పాస్టర్ ఇస్మాయిల్ మాత్రం పోలీసులు తనపై దాడిచేసినట్లు ఆరోపించారని.. డిప్యూటీ స్పీకర్ రఘురామపై విమర్శలు చేశారన్నారు.'ఇస్మాయిల్ గురించి నిజాలు తెలిసిన తర్వాత ఆకివీడు పెదపేటలో స్థానికుల్ని పిలిచి అన్ని విషయాల గురించి వారితో చెప్పాను. పాస్టర్ ఇస్మాయిల్ అంతటితో ఆగకుండా చర్చిల్చి కూల్చివేస్తున్నారంటూ తన యూట్యూబ్ ఛానల్‌లో వీడియోను అప్‌లోడ్ చేయడంతో వైరల్ అయ్యింది. ఆ తర్వాత చుట్టపక్కల పాస్టర్లు ఆయన్ను పరామర్శించడానికి వచ్చారు, సన్మానం చేశారు. అప్పుడు ఇస్మాయిల్ గురించి ఆరా తీస్తే పూర్తి వివరాలు తెలిశాయి. ఇస్మాయిల్ ఆర్థికంగా స్థిరపడటానికి, రాజకీయ ఎదుగుదల కోసం ఇస్మాయిల్ ఇలా చేశారని తెలిసింది. తన సొంత ప్రయోజనాల కోసం ఇస్మాయిల్ దళితుల్ని పావులుగా వాడుకుంటున్నారు. నేను ఎక్కడా డిప్యూటీ స్పీకర్ రఘురామ గురించి ఎమ్మెల్యే గురించి మాట్లాడలేదు' అన్నారు.'పెదపేటలో అమ్మవారి గుడి కావాలి, రామాలయం వద్దని చెబుతున్నారు. ఆ విషయాన్ని పక్కన పెట్టి సొంత ప్రయోజనాల కోసం ఇస్మాయిల్ ఏదేదో మాట్లాడారు. ఈ క్రమంలోనే డిప్యూటీ స్పీకర్ రఘురామ మమ్మల్ని తప్పుగా అనుకున్నారు. నేను గత ఎన్నికల్లో కూటమి పార్టీల కోసం పనిచేశాను.. యువగళం సమయంలో నారా లోకేష్‌పై రాళ్లు వేసిన సమయంలో, పవన్ కళ్యాణ్ వచ్చిన సమయంలో ఆయనకు వ్యతిరేకగా జరిగిన ఘటనల్ని నేను ఖండించాను.. మా నాన్న, చిన్నాన్న టీడీపీలో ఉన్నారు. నేను ఏదైనా తప్పు జరిగితే.. ఇది తప్పు అని నేను రియాక్ట్ అవుతాను. ఆకివీడు పెదపేటలో జరిగిన ఘటనకు నాకు ఎలాంటి సంబంధం లేదు.. ఆ గొడవలో నన్ను ఇరికించారు. కానీ నా వాదనను ఎవరూ పట్టించుకోలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.'ఇస్మాయిల్ అనే వ్యక్తి స్వలాభం కోసం చేసిన పనితో నేను ఈ కేసులో ఇరుక్కున్నాను. ఈ కేసు నమోదు చేసిన తర్వాత నేను జైలుకు వెళ్లాను.. బెయిల్‌పై వచ్చాను. ఇస్మాయిల్ ఎమ్మెల్యేను విమర్శిస్తే లక్షల రూపాయలు వస్తున్నాయి. ఈ ఘటనలో ఇంకా చాలామంది జైల్లో ఉన్నారు కానీ ఇస్మాయిల్ కనీసం వాళ్లను పరామర్శించలేదు. ఇస్మాయిల్ ఈ ఘటన తర్వాత కొంతమంది దగ్గర డబ్బులు వసూళ్లు కూడా చేశారు.. ఈ ఘటనలో వాస్తవాలు తెలియాలనే నేను ఈ విషయాలను చెబుతున్నాను. ఇస్మాయిల్ చేసిన తప్పులకు సంబంధించి నా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయి. త్వరలోనే అన్ని వివరాలు చెబుతాను' అని చెప్పుకొచ్చారు జయరాజు.

# కాపు వర్గం మారుతోందా

కాకినాడ, ఏప్రిల్ 29, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వచ్చినట్లే కలలు కంటోంది. ఎంతగా అంటే వచ్చే ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తమన్నంతగా. ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో తాము సులువుగా గెలుస్తామన్న గుడ్డినమ్మకంతో ఆ పార్టీ నేతలు ఉన్నట్లు కనిపిస్తుంది. అందుకే నేతలు ఎక్కడిక్కడకక్కడ ఈ సమయంలోనూ తమ నియోజకవర్గంలో వ్యాపారాలు దెబ్బతినకుండా టీడీపీ నేతలతో కుమ్మక్కువుతున్నారన్న ఆరోపణలున్నాయి. రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాల్లో టీడీపీ, వైసీపీ మిలాఖత్ అయి మద్యం, ఇసుక వంటి వ్యాపారాలు చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. అయితే ఇవి లోపాయికారిగా జరిగినప్పటికీ బాహ్య ప్రపంచానికి మాత్రం సులువుగానే తెలుస్తోంది.అందుకే ప్రజలు రెండు పార్టీలను ఒకే గాటిన కట్టే అవకాశముంది. ముఖ్యంగా వైసీపీకి పట్టున్న కొన్ని జిల్లాల్లోనూ టీడీపీ నేతలతో వ్యాపార సంబంధాలను నెరుపుతూ గుట్టుగా పది రూపాయలు సంపాదించుకునే పనిలో ఉన్నారు. అందుకే స్థానిక ఎమ్మెల్యేలపై విమర్శలు చేయడం లేదు. టీడీపీ ఎమ్మెల్యేలు కూడా తమపై వ్యక్తిగత ఆరోపణలు చేయకుండా వారిని తమలో ఒకరిగా చేర్చుకుని కొత్త స్ట్రాటజీకి తెరదించారు. ఈ విషయాలను వైసీపీ కార్యకర్తలే సోషల్ మీడియా ద్వారా బయటకు చెబుతున్నారు. ఉదాహరణకు నెల్లూరు జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో కొందరు వైసీపీ నేతలు టీడీపీ నేతలతో కలసి రహస్యంగా వ్యాపార భాగస్వాములుగా ఉన్నారు.అయితే వైసీపీ కేంద్ర నాయకత్వం వీటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. లైట్ గానే తీసుకుంటుంది. అంతెందుకు వైఎస్ జగన్ సొంత జిల్లా కడపలోనూ అనేక మంది వైసీపీ నేతలకు టీడీపీ నేతలతో లోపాయికారీ ఒప్పందాలున్నట్లు చెబుతున్నారు. ఇవి కార్యకర్తలకు తెలుసు. కానీ వైసీపీ నాయకత్వం మాత్రం వారిపై చర్యలకు తీసుకోవడానికి మాత్రం సిద్ధంగా లేదు. ఇలాగే కొనసాగితే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కానీ, తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో కానీ వైసీపీ నేతలు అధికార పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అవకాశం లేదన్నది వాస్తవం. ఇప్పటికైనా నాయకత్వం జాగ్రత్త పడకపోతే నష్టం స్థాయి అంచనా వేయలేని స్థితిలో ఉండనుంది.

## తీరనున్న కనిగిరి ప్రాంత వాసుల కల

ఒంగోలు, ఏప్రిల్ 29, పశ్చిమ ప్రకాశం, మార్కాపురం జిల్లావాసులు.. ముఖ్యంగా కనిగిరి ప్రాంత ప్రజల కలనెరవేరనుంది. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైలు సౌకర్యం త్వరలోనే అందుబాటులోకి రానుంది. గుంటూరు నుంచి కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు రైల్వే అధికారులకు ప్రతిపాదనలు పంపారు. వారంలో ఆరు రోజుల పాటూ రైలును నడిపేలా ప్రతిపాదించారు. రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని.. త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుందని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రం సహకారంతో రైల్వే ప్రాజెక్టుల పనులు వేగవంతం అవుతున్నాయి. పాత ప్రాజెక్టులతో పాటుగా కొత్త ప్రాజెక్టులు కూడా ఒక్కొక్కటిగా పట్టాలెక్కుతున్నాయి. రాష్ట్రంలో కీలకమైన నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులు వేగవంతం చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లా, ప్రస్తుతం మార్కాపురం జిల్లా కనిగిరి వరకు పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం పామూరు వైపుగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కనిగిరి వరకు రైల్వే లైన్ పనులు పూర్తికావడంతో అక్కడి వరకు రైళ్లు నడపాలని ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులతో పాటుగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. రైల్వేశాఖకు విన్నవించారు.కనిగిరివాసుల ఎన్నో ఏళ్ల కలను నిజం చేసే దిశగా ఓ ముందడుగు పడింది. నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు ప్యాసింజర్ రైలును నడిపేందుకు ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. గుంటూరు నుంచి గుండ్లకమ్మ మీదుగా కనిగిరి వరకు ఈ రైలును నడిపేందుకు గుంటూరు రైల్వే డివిజన్ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు.ారంలో ఆరు రోజుల పాటూ గుంటూరు నుంచి కనిగిరి వరకు ఈ కొత్త సర్వీస్‌ను నడపాలని ప్రతిపాదించారు. ఈ ప్యాసింజర్ రైలు గుంటూరులో ఉదయం 8.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1 గంటకు కనిగిరి చేరుకునేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. ఈ రైలు తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2 గంటలకు కనిగిరి నుంచి బయల్దేరి రాత్రి 7 గంటలకు గుంటూరు చేరుకునేలా ప్లాన్ చేశారు. అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే పూర్తి షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉందంటున్నారు.నడికుడి టు శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్‌లో కనిగిరి వరకు రైలును నడపాలని గతంలోనే ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రైల్వే అధికారులకు విన్నవించారు. ఇటీవల రైల్వే అధికారుతో మాట్లాడటంతో సానుకూలంగా స్పందించారు. కనిగిరి రైల్వే స్టేషన్ పనులు పూర్తికావడం, ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందబాటులోకి రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేవు అంటున్నారు. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా పూర్తి చేయడంతో.. కొత్తగా ప్యాసింజర్ రైలును కనిగిరి వరకు నడిపేందుకు దాదాపుగా లైన్ క్లియర్ అయినట్లేనని చెబుతున్నారు. కనిగిరి నుంచి ప్యాసింజర్ రైలు ప్రారంభమైతే ఆ ప్రాంతం నుంచి రాజధాని ప్రాంతమైన గుంటూరుకు కనెక్టివిటీ కూడా పెరుగుతుందంటున్నారు.

# నాటి చంద్రబాబు కాదా...

విజయవాడ, ఏప్రిల్ 29, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెతక వైఖరిని అవలంబిస్తున్నారు. గతంలో అధికారుల విషయంలో కఠినంగా వ్యవహరించేవారు. పార్టీ నేతలు కూడా క్రమశిక్షణతో మెలిగేవారు. కానీ ఎందుకో.. ఏమో..తెలియదు కానీ చంద్రబాబులో చాలా మార్పు కనిపిస్తుంది. పార్టీ నేతల సంగతి పక్కన పెడితే అధికారులపై కూడా అజమాయిషీ లేకుండా పోయింది. సమీక్షల్లో సీరియస్ అనే మాటలను వినటమే కానీ.. కనీసం సమస్యకు కారణమయిన వారిపై ఎలాంటి చర్యలకు దిగకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తనలో 1995 నాటి ముఖ్యమంత్రిని చూస్తానని ప్రకటించారు. 1995 నాటి ముఖ్యమంత్రి మాటేమో కానీ, కనీసం 2014 నాటి ముఖ్యమంత్రి కూడా కనిపించడం లేదన్న కామెంట్స్ ఇప్పుడు కార్యకర్తల్లో ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఎందుకంటే గత వారం రోజుల నుంచి ఆంధ్రప్రదేశ్ లో పెట్రోలు, డీజిల్ కొరత సమస్య ఉందని తెలిసినప్పటికీ అధికారుల ఉదాసీన వైఖరిని ఆయన ప్రశ్నించలేకపోతున్నారు. అదే సమయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ అంటూ నిత్యం పరితపించే చంద్రబాబు ఇంత జరుగుతున్నా అది ఏం చేస్తుందన్న దానిపై కూడా నాయుడు పెదవి విప్పకపోవడం చర్చనీయాంశమైంది. నిజానికి చంద్రబాబు అధికారులను అలా ఊరికే వదిలేసే రకం కాదు. ఇరవై నాలుగు గంటలు వెంటపడి పనులు చేయించుకుంటారన్న పేరు ఆయనకు గతంలో ఉండేది.కానీ 2024 తర్వాత మాత్రం చంద్రబాబు నాయుడు పూర్తిగా మారిపోయారు. ఎంతగా మారిపోయారంటే.. ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టడం వంటి వాటికే సరిపెట్టారు. అందులో ఎక్కువగా తన విజన్ తో పాటు తన పూర్వ విషయాలను చెప్పుకోవడమే సరిపోతుంది. అంతేతప్ప క్షేత్రస్థాయిలో జరుగుతున్న లోపాలు సరిదిద్దలేకపోవడం, సక్రమంగా హెచ్చరికలు జారీ చేయకపోవడం వల్లనే ఇటువంటి పరిస్థితులు తలెత్తాయని అంటున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 29:నంద్యాల మండలంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులకు ఏప్రిల్ 28, 29 తేదీల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ జీవామృతం, ఘనజీవామృతం, సహజ కాషాయాల ద్వారా పంటల సాగు విధానాలను వివరించారు.మండల వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ పి.ఎం.డి.ఎస్ కిట్ల వినియోగం, వివిధ విత్తనాలను ఒక కిట్‌గా రైతులకు అందించి తొలకరి వర్షాలతో విత్తాలని సూచించారు. దీని వల్ల భూమి సారవంతం పెరిగి, నీటి నిల్వ సామర్థ్యం మెరుగుపడుతుందని తెలిపారు.తదుపరి పాండురంగాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పంటలను సిబ్బంది పరిశీలించారు. కార్యక్రమంలో భాష, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు హత్యపై ఖండన---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 29: చిత్తూరు జిల్లా వీ.కోటలో ఆంధ్ర జ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి హత్య దారుణమని ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఖండించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీగంధం మాఫియాపై వార్తలు రాయడంతోనే హత్య జరిగినట్లు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని, జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమ కమిటీలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లా నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

## టిడ్కో గృహాలను సందర్శించిన కమిషనర్--


విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 29-టిడ్కో గృహాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తున్న ప్రజలతో నేరుగా మాట్లాడి తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, డ్రైనేజీ వంటి వసతులపై సమస్యలను తెలుసుకున్నారు. నివాసితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ప్రత్యేకంగా పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచాలని, చెత్త సేకరణను క్రమబద్ధంగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చూడాలని, డ్రైనేజీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# పంట మార్పిడితో రైతుల ఆదాయం పెంపు--

## జిల్లా కలెక్టర్ జి రాజకుమారి గణియా---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 29:- జిల్లాలో వ్యవసాయాన్ని లాభదాయకంగా, స్థిరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రాంతీయ పరిశోధన?విస్తరణ సలహా మండలి సమావేశాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 3.35 లక్షల మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని




తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఇచ్చే పంటలు, నీటి సమర్థ వినియోగం, ఆధునిక సాంకేతికత వినియోగంపై దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు శిక్షణలు, సాంకేతిక పరిజ్ఞానం అందించి మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపరచడం ద్వారా ఆదాయం పెంచే చర్యలు చేపడుతున్నామని తెలిపారు.పంట మార్పిడి అత్యవసరమని స్పష్టం చేసిన కలెక్టర్, వరి సాగుపై ఆధారపడకుండా మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులు మళ్లాలని సూచించారు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, ఉద్యాన పంటల సాగు ద్వారా ఆదాయం పెరుగుతుందని చెప్పారు. జిల్లాలో ఉన్న బీడు భూములను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయం, సమతుల్య ఎరువుల వినియోగంతో నేల ఆరోగ్యం కాపాడాలని, రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించాలని హెచ్చరించారు. ధాన్యం విక్రయంలో నాణ్యత ప్రమాణాలు పాటించి తేమ శాతం తగ్గించి అమ్మితేనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు.ఉద్యాన, పశుసంవర్ధక రంగాలు రైతులకు స్థిర ఆదాయం అందిస్తున్నాయని పేర్కొన్న కలెక్టర్, శాఖల సమన్వయంతో పనిచేస్తే వ్యవసాయం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నంద్యాల జిల్లాను వ్యవసాయంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు.

# కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 29-నంద్యాల మండలం చాబోలు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి వారి ఖాతాల్లో జమ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు.ఎండలు తీవ్రమవుతున్నా తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆయన విమర్శించారు. పెరిగిన ధరల నేపథ్యంలో కూలీల కనీస వేతనాన్ని రూ.700కు పెంచాలని కోరారు.నెలలుగా వేతనాలు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బకాయిలు చెల్లించకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

## నర్సింగ్ వృత్తికి ప్రపంచవ్యాప్తంగా అపారమైన అవకాశాలు

### తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి...

తిరుపతి ,తిరుపతిలోని గెస్ట్ లైన్ హోటల్ వేదికగా జరిగిన ఓవిఆర్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ మరియు ఓవిఆర్ స్కూల్ ఆఫ్ నర్సింగ్, విబిఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థుల 'ఆరంభ్ 2 కె26' ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు ఘనం గా జరిగాయి.ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ:వైద్య రంగంలో డాక్టర్లు సూచించిన చికిత్సను రోగులకు అందించడంలో నర్సుల పాత్ర అత్యంత కీలకమని, వారికి సమాజంలో ఒక ప్రత్యేక గౌరవం ఉందని ఆయన తెలిపారు. గతంలో కేరళ నర్సులకు మాత్రమే గ్లోబల్ స్థాయిలో గుర్తింపు ఉండేదని, నేడు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు వారితో పోటీ పడుతూ ప్రపంచవ్యాప్తంగా అపారమైన ఉద్యోగ అవకాశాలను దక్కించుకుంటున్నారని తెలిపారు.నర్సింగ్ రంగంలో దాదాపు 95% నుండి 98% వరకు మహిళలే ఉండటం శుభపరిణామమని, వారు క్రమశిక్షణ మరియు సేవా భావంతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఇటీవల తాను దక్షిణ కొరియా పర్యటనలో 30 దేశాల ప్రతినిధుల సమక్షంలో భారత్ తరపున పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ మరియు వరద నిర్వహణ పై ప్రసంగించానని,అటువంటి స్ఫూర్తితో విద్యార్థులు కూడా అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. తాను ఒక సాధారణ రైల్వే ఉద్యోగి కుమారుడిగా పుట్టి, కష్టపడి నేడు డాలర్స్ గ్రూప్ ద్వారా రాయలసీమలో ఒక బ్రాండ్ సృష్టించానని గుర్తుచేసారు.వ్యాపారవేత్తలే ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా సక్సెస్ అవుతున్నారని విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి.వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ని ఘనం గా సత్కరించిన కళాశాల యాజమాన్యం.ఈ కార్యక్రమంలో ఓవిఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వెల్పుల విజయ భాస్కర్, వెల్పుల త్రిపుర దేవి, అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇక 3 గంటల్లో ముంబై

హైదరాబాద్, ఏప్రిల్ 29, (న్యూస్ పల్స్)హైదరాబాద్ నుంచి ముంబైకు 3 గంటల్లోనే చేరుకోవచ్చు. అవును.. ఈ రెండు ప్రాంతాల మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మించనున్నారు హైదరాబాద్-పుణె-ముంబై మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ రానుందని, దీనికి సంబంధించి ఇప్పటికే డీపీఆర్ కూడా పూర్తయిందని తెలిపారు. దాదాపు 761 కిలోమీటర్ల మేర ఈ రైలు కారిడార్ ఉంటుందని, డీపీఆర్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. ఈ కారిడార్‌పై కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్-ముంబై హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టు పనులను వేగంగా మందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఇది అందుబాటులోకి వస్తే మూడు గంటల్లోనే రెండు నగరాల మధ్య ప్రయాణించవచ్చని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్, నాగ్‌పూర్ మధ్య వందే భారత్ రైలు అందుబాటులో ఉంది. హైస్పీడ్ రైలు కారిడార్ అందుబాటులోకి వస్తే వేగవంతమైన ప్రయాణం అందుబాటులోకి వస్తుంది

## నృసింహా స్వామి వార్షికోత్సవాలు ప్రారంభం---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 29-నంద్యాల తెలుగు పేటలోని శ్రీ ఘణ మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామి దేవస్థానంలో బుధవారం అష్టవింశతి (28వ) వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కళ్యాణ దాతలచే ధ్వజారోహణంతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి దేవస్థానం నుంచి జలకలశాలతో ఊరేగింపు నిర్వహించి, కలశ స్థాపన చేపట్టారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పంచామృత అభిషేకం, స్నపన తిరుమంజనం నిర్వహించారు. తిరుమంజన జలంతో అభిషేకాలు, మూలమూర్తులకు సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.చివరగా నివేదన, మహా మంగళహారతితో కార్యక్రమాలు ముగిశాయి. ఈ కార్యక్రమాల్లో కళ్యాణ దాతలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు వేగవంతం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 29 :-నంద్యాల జిల్లాను ప్రమాద రహితంగా మార్చేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ సునీల్ షొరాణ్‌తో కలిసి జాతీయ రహదారులపై గుర్తించిన బ్లాక్ స్పాట్ల పరిశీలన యాత్రను ప్రారంభించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు 29 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించారు. వీటిలో ఎన్‌హెచ్-40పై 9, ఎన్‌హెచ్-44పై 7, పట్టణ పరిధిలో 6, ఇతర రహదారులపై 7 ప్రాంతాలు ఉన్నాయి. గత సంవత్సరం 567 ప్రమాదాలు జరిగి 296 మంది మృతి చెందినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.ప్రమాదాల నివారణకు నేషనల్ హైవేస్, ఆర్ అండ్ బి, పోలీస్, ట్రాన్స్‌పోర్ట్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. స్పీడ్ బ్రేకర్లు, సీసీటీవీలు, లైటింగ్ ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నారు. వాహనదారులు వేగ పరిమితులు పాటించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి చేయాలని అధికారులు సూచించారు.ఒక నెలలో సమస్యలను పరిష్కరించి ప్రమాదాలను గణనీయంగా తగ్గించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బి, పోలీస్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 29-నంద్యాల జిల్లా పట్టణంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ లక్ష్యంగా బొమ్మలసత్రం, రైల్వే స్టేషన్, నూనెపల్లి, సాయిబాబా నగర్, ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలు, హరిజనవాడ రైల్వే ట్రాక్, ఆటోనగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు.అనుమానిత ప్రాంతాల్లో నిఘా పెంచాలని, మాదకద్రవ్యాలు మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. రాత్రి గస్తీని ముమ్మరం చేసి, నేరచరిత్ర గల వ్యక్తుల కదలికలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు.జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190